'చదువుపైనే దృష్టి సారించాలి'

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల జోలికి వెళ్లకుండా చదువు పైనే విద్యార్థులు దృష్టి సారించాలని సీపీ అనూరాధ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్) నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 1700 మంది విద్యార్థులు ఆయుధాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సీపీ సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఏఆర్ అదనపు డీసీపీలు రామచంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు మధు, సుమన్‌కుమార్, సీఐలు పాల్గొన్నారు. నూతన సాంకేతికతతో అందుబాటులోకి వచ్చిన స్పీడ్ లేజర్ గన్‌ను కమిషనరేట్‌లో సీపీ పరిశీలించారు. గన్ ఆపరేటర్ జగదీశ్వర్ సీపీకి వివరించారు. సిద్దిపేట సబ్ కోర్టు అదనపు పీపీ (అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్) వి.నర్సయ్య మర్యాదపూర్వకంగా సీపీని కలిశారు.



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న సీపీ అనూరాధ

సకాలంలో పన్నులు చెల్లించండి: బల్దియా కమిషనర్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట బల్దియా పరిధిలో శతశాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం బరిలోకి దిగుతోంది. బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగి ఇంటి పన్నులు వసూలు చేయిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణ శివారులోని ఓ వాణిజ్య సంస్థకు సంబంధించి రూ.2,78,456 పన్నును కట్టించారు. శివాజీనగర్‌లో పలువురు ఇంటి ముందు రోడ్డును ఆక్రమించి ర్యాంపులు, మెట్లతో పాటు అదనపు స్లాబులను కట్టుకున్నారు. వాటిని పోలీసుల సాయంతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారి దేవరాజ్ కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ స్థలాన్ని దాటి నిర్మాణంలో ఆక్రమించిన వారందరికీ గతంలో నోటీసులు జారీ చేశామన్నారు. వాటికి స్పందన లేకపోవడంతోనే కూల్చివేశామని చెప్పారు. నూతనంగా గృహాలు నిర్మించుకునే వారు సైతం తప్పనిసరిగా మున్సిపాలిటీ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ప్రణాళిక విభాగం అధికారి సూచించారు.



లేత కిరణం మేఘావరణం

ఆకాశ దేహమంతా పరుచుకున్న నల్లటి మేఘానికి కొత్త వర్ణం అద్దింది.. లేలేత సూరీడి కిరణం. తెలవారుతుండగా సూర్యుడి కిరణాలు లేత ఎరుపు రంగులో దూసుకొచ్చి మేఘానికీ వెలుగిచ్చాయి. ఈ సుందర దృశ్యం సిద్దిపేటలోని కోమటిచెరువు కట్టపై ఉషోదయాన ఆవిష్కృతమైంది. కోమటిచెరువు నీటి సాక్షిగా ఓ వైపు తీగల వంతెన మురుస్తుండగా.. మరోవైపు బతుకమ్మ ఘాట్ మధ్యలోంచి దృశ్యం నడకకు వచ్చిన ప్రజలను ఆనందచకితులను చేసింది. – న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

కల్లంలో కళ్లంబడి నీళ్లు

అకాల వర్షంతో అన్నదాతల ఆవేదన

న్యూస్‌టుడే, గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, మిరుదొడ్డి, హుస్నాబాద్ గ్రామీణం: వానాకాలం సీజన్‌లో పండించిన వరి ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధమవుతున్న రైతుల ఆశలపై కురిసిన అకాల వర్షాలు నీళ్లు చల్లాయి. కల్లాల్లో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న తడిసిపోయి, వరదకు కొట్టుకుపోయి తీవ్ర నష్టం కలిగించింది. కర్షకులకు కన్నీళ్లు మిగిల్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన తూకాలు మొదలు పెట్టకపోవడంతో పంట కాస్త నీటి పాలవుతోంది. మళ్లీ ధాన్యం, మక్కలను ఆరబెట్టుకుంటున్నారు. దుబ్బాక ఏఎంసీ విపణిలో ధాన్యం పూర్తిగా తడిసి, నీటి ద్వారా కాలువల్లో కొట్టుకుపోయింది. దాదాపు ఏఎంసీలో60 క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయింది. 50 మంది రైతులు ఇక్కడ ఆరబెట్టారు. జిల్లాలో మొత్తం 417 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు ఇప్పటిదాకా 81 చోట్ల తెరిచారు. జిల్లా అధికారులు రైస్ మిల్లులను కేటాయించకపోవడంతో, మండల వ్యాప్తంగా ఏ ఒక్క కేంద్రంలోనూ కొనుగోలు ప్రకియ ప్రారంభం కాలేదు. గత వారం రోజుల నుంచి రైతులు కోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకువచ్చి, అక్కడే కుప్పలుగా ఆరబోస్తున్నారు. మిరుదొడ్డి, సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన దాదాపు 100 క్వింటాళ్ల ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. పలు చోట్ల మొక్కజొన్నలు తడిసిపోయాయి. జిల్లాలో మొత్తంగా రూ.25 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.



దుబ్బాకలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

నేలవాలి మురుగుతోంది:



హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో కల్లాల వద్ద ఆరబెట్టిన పంటలు తడిసి పోయాయి. పొలాల్లో ఇంకా కోయని పంట నేలవాలింది. గాంధీనగర్, చౌటపల్లిలో వరి పంట అక్కరకు రాకుండా పోతోంది. గింజలు పాలుపోసుకునే దశలో వానతో నేల వాలి మురిగిపోయే ప్రమాదం ఉంది. 3 ఎకరాల్లో సన్న రకం వరి నష్టపోయాను.

ఆవుల కొమురయ్య, చౌటపల్లి

మొక్కజొన్నలు నల్లబారాయి



నేను రెండు ఎకరాల్లో మొక్కజొన్న, నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. మొక్కజొన్న కోత కోసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న మక్కలపై వర్షం కురవడంతో తడిసి నల్లబారాయి. గిట్టుబాటు ధర లేకుండాపోయింది. మిరుదొడ్డి మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేకపోవడంతో వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

రాజు, మిరుదొడ్డి

తూకాలు ప్రారంభించాలి:



నాలుగు ఎకరాల్లో వరి వేసిన. అకాల వానలు కురియడంతో పెట్టుబడి కూడా రావడం కష్టంగా ఉంది. పంట నేలకొరిగింది. రెండు ఎకరాల్లో కోత కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించినా తూకం ఇప్పటికీ ప్రారంభించలేదు. తెచ్చినవన్నీ తడిసిపోయాయి.

కనకయ్య, మిరుదొడ్డి

చేతికొచ్చీ లాభం లేదు

10 ఎకరాల సొంత వ్యవసాయ పొలంతో పాటు, మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. వరి పండించి పావు భాగం కోసిపెట్టిన. వారం క్రితం 15 ట్రాక్టర్ల ధాన్యాన్ని దుబ్బాక ఏఎంసీకి తీసుకొచ్చిన. సోమవారం కురిసిన వర్షానికి 6 క్వింటాళ్లు కొట్టుకుపోయింది. పెంబర్తి శ్రీశైలం, లచ్చపేట



దుబ్బాక: వడ్లు ఆరబోస్తున్న పెంబర్తి శ్రీశైలం

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆరు ఎకరాల్లో ధాన్యం పండించి ఆరు ట్రాక్టర్లలో దుబ్బాక వ్యవసాయ మార్కెట్‌కు తెచ్చాం. ఆరబెట్టగా వాన ధాటికి 3 కింటాళ్లు ప్రవాహంలో కొట్టుకుపోయింది. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా త్వరగా ధాన్యం కొనుగోలు ప్రకియ చేపట్టాలి. తడిసిన ధాన్యాన్ని కొనాలి. కొట్టుకుపోయిన ధాన్యానికి పరిహారం ఇవ్వాలి. ఎంగారి సుగుణ, దుబ్బాక



పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్

న్యూస్‌టుడే, హుస్నాబాద్: ఆరుగాలం శ్రమించి దిగుబడి సాధించిన పత్తి రైతులను కొందరు వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలో బహిరంగ కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదు. పత్తి చేతికందిన తర్వాత మార్కెటింగు సదుపాయం లేకపోవడంతో వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకుని కనీస మద్దతు ధర ఇవ్వకుండా కోత, తరుగు తీస్తున్నారు. వ్యవసాయ విపణి ఉన్నప్పటికీ అందులో ఇప్పటి వరకు క్రయవిక్రయాలను ప్రారంభించలేదు. పట్టణంలో దాదాపు 40 మంది ట్రేడర్లు ఉన్నారు. దుకాణాలు, మిల్లుల వద్ద కొనుగోళ్లు చేపడుతున్నారు. సీసీఐ కొనుగోళ్లను ఇప్పటి వరకు ప్రారంభించకపోవడం వ్యాపారులకు వరంగా మారింది. కొందరు వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తిని బినామీ పేర్లపై సీసీఐకి అనంతరం విక్రయిస్తారు. హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో 23,494 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దుకాణాల వద్ద కొనుగోలు చేస్తున్న వ్యాపారులు సంచి కిలో చొప్పున తరుగు తీసి తూకం వేస్తున్నారు. కొనుగోలు చేసిన పత్తికి రెండుశాతం నగదు కోత పెట్టి చెల్లింపులు చేస్తున్నారు. హమాలీ ఛార్జీలు రైతు నుంచి వసూలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మీర్జాపూర్‌కు చెందిన ఒక రైతు రెండు సంచుల్లో పత్తి తీసుకువచ్చి ఓ వ్యాపారికి విక్రయించారు. వ్యాపారి తూకం వేసి సంచి కిలో చొప్పున రెండు కిలోలు ముందుగా తరుగు తీసి 58 కిలోలు లెక్క గట్టారు. క్వింటాలుకు రూ.6500 చొప్పున ధర నిర్ణయించారు. 58 కిలోలకు 2 శాతం క్యాష్ కటింగ్ హమాలీ ఛార్జీలు కలిపి రూ.150 కోత పెట్టి మిగిలినవి చెల్లించారు. దీనిని అరికట్టేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



హుస్నాబాద్‌లో దుకాణం ముందు పత్తి

ప్రగతి 'మార్గం'.. ప్రయాణం సుగమం



కూరెల్ల నుంచి తంగళ్లపల్లి వెళ్లే రహదారి

న్యూస్‌టుడే, హుస్నాబాద్: రహదారుల విస్తరణ, పునర్నిర్మాణానికి నిధుల విడుదల కావడంతో ప్రయాణాలకు మార్గం సుగమం కానుంది. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లోని ఏడు రహదారులకు మహర్దశ పట్టనుంది. గత కొంతకాలం రహదారులను అభివృద్ధి పరచాలనే ఆయా గ్రామాల ప్రజల కోరికకు కార్యరూపం దాల్చనుంది. సీఆర్‌ఆర్ గ్రాంటు రూ.11.49 కోట్లు మంజూరయ్యాయి. హుస్నాబాద్ మండలంలో ప్రధానంగా పందిల్ల నుంచి పొట్లపల్లి మీదుగా హుస్నాబాద్‌కు 5.50 కి.మీ దూరం ఉన్న సింగిల్ రోడ్‌ను డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.3.95 కోట్లు మంజూరు చేశారు. పొట్లపల్లిలో స్వయంభూ రాజేశ్వరస్వామి క్షేత్రం ఉంది. భక్తుల రాకపోకలు అధికంగా ఉంటాయి. సులభంగా ఆలయానికి చేరుకోగలుగుతారు. ప్రజలకు రవాణా సౌకర్యం మరింతగా మెరుగు పడుతుంది. తోటపల్లి నుంచి పూసవర్లపల్లి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి రూ.1.49 కోట్లు మంజూరు చేశారు. వంతెన పూర్తయితే భారీ వర్షాలొచ్చినా ప్రయాణానికి అంతరాయం ఉండదు. కోహెడ నుంచి కూరెల్ల మీదుగా తంగళ్లపల్లి ఎక్స్ రోడ్ వరకు ... తీగలకుంట పల్లి నుంచి సోమారంపల్లె మీదుగా శ్రీరాములపల్లి వరకు నిర్మిస్తారు. అక్కన్నపేట మండలం ఆర్అండ్‌బీ రోడ్ నుంచి సంజీవరాయ కాలనీ వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తారు. పీడబ్ల్యూడీ రోడ్ నుంచి చౌటపల్లి మీదుగా మల్లంపల్లి రహదారిలో సీడీ వర్క్స్ కొరకు రూ.కోటి, జడ్పీ రోడ్ నుంచి పరికిబండ వరకు రహదారి నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. వంతెనలు, కల్వర్టులు నిర్మిస్తారు.

సమష్టి కృషితో సరికొత్త ఆవిష్కరణలు

ములుగు, న్యూస్‌టుడే: సమష్టి కృషితో ఉద్యాన విభాగంలో సరికొత్త ఆవిష్కరణలతో ఆదర్శంగా నిలువాల్సిన బాధ్యత అందరిపై ఉందని ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) రాజిరెడ్డి అన్నారు. మంగళవారం పరిపాలన విభాగం కార్యాలయంలో వర్సిటీ కళాశాలలు, పరిశోధన కేంద్రాల్లోని అధ్యాపకులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. భవిష్యత్తులో విద్యార్థులకు, రైతులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను అమలు చేయాలని అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రిజిస్ట్రార్ భగవాన్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

భూ దస్త్రాల గదిలో వసూళ్ల దందా!

బెజ్జంకి, న్యూస్‌టుడే: రెవెన్యూ భూ దస్త్రాల్లో మార్పులు, చేర్పులకు పహణీలు కీలకం కావడంతో కొందరు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయంలోని దస్త్రాల గది (రికార్డు రూం)లో పని చేస్తున్న సిబ్బంది కొద్ది నెలలుగా వసూళ్లకు తెర లేపారని చెబుతున్నారు. ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. కంప్యూటరీకరణ తరువాత 2012కు ముందు కావాల్సిన పహణీల కోసం కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వాటిని నిర్ణీత గడువులోపు అందించాలి. పత్రాల జిరాక్సు ఖర్చులు భూయజమానులే భరిస్తున్నారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు 1955 నుంచి 2010 వరకు పహణీల కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.4 వేలు, మరో రైతు నుంచి రూ.1500 సిబ్బంది డిమాండ్ చేయడంతో కంగుతిన్నారు. ఈ సమస్యపై తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని, విచారణ చేసి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నాచగిరి క్షేత్ర సమీపంలో కట్టడి ముట్టడి

ఈనాడు కథనానికి స్పందన

వర్గల్, న్యూస్‌టుడే: నాచగిరి క్షేత్రం సమీపంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కట్టడి ముట్టడి నిర్వహించారు. గ్రామీణ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది బృందాలుగా విడిపోయి తనిఖీలు చేశారు. ఈ నెల 19న 'ఈనాడు' పత్రికలో 'అసాంఘిక పనులు.. తీసుకోవాలి చర్యలు' శీర్షికతో కథనం ప్రచురితం కాగా పోలీసు అధికారులు స్పందించి కట్టడి ముట్టడి చేపట్టారు. కిరాణా దుకాణాలు, సత్రాలు, ఇళ్లు, లాడ్జీలు, వైన్స్ షాప్‌లు సోదా చేశారు. ధ్రువపత్రాలు లేని 25 బైకులు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. అద్దెలకు ఇచ్చే యజమానులు ధ్రువపత్రాలు తీసుకున్న తర్వాత రూంలు ఇవ్వాలని ఏసీపీ ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.



సిద్దిపేట చింతలచెరువులో చేపలు పడుతున్న కర్నూలు నుంచి వచ్చిన కూలీలు



పట్టిన చేపలను చూపుతున్న కూలీలు

కొత్తగా తెప్పలొచ్చెనో!

జిల్లాలో సాధారణంగా వలలు, గేలం వేసి మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తుంటారు. ఇందుకు భిన్నంగా సిద్దిపేట చింతలచెరువులో కొందరు తెప్పల్లో వెళ్లి చేపలను పట్టుకున్నారు. సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని నీటివనరుల్లో చేపలు పట్టడానికి కర్నూలు వాసులు లీజుకు తీసుకున్నారు. కర్నూలు నుంచి 15 మంది ఇక్కడికి ప్రత్యేక తెప్పలు తీసుకొని వచ్చారు. చేపల వేట చేపట్టారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్

భూమి తన పేరిట మార్చాలని రైతు ఆందోళన

వర్గల్, న్యూస్‌టుడే: 'బతికుండగానే చంపేసింద్రు.. నా భూమి ఇంకొకరి పేరు మీదకి మార్చిన్రు.. నా పిల్లల్ని ఆగం చేసింద్రు.. ఇప్పుడు నేను బతికి ఏం లాభం సార్.. అందుకే నేను సద్దాం అనుకుంటున్నా.. అంటూ ఓ రైతు వర్గల్ తహసీల్దార్ కార్యాలయంలో పురుగు మందు డబ్బా పట్టుకొని మంగళవారం నిరసన చేపట్టాడు. వేలూరు గ్రామానికి చెందిన రైతు ఉప్పరి పోచయ్యకు వ్యవసాయ భూమి ఉంది. 2019లో 'ఉప్పరి పోచయ్య' అని పేరున్న మరో వ్యక్తి చనిపోవడంతో బాధితుడి 37 గుంటల భూమిని ఇతరులకు సరిగా పరిశీలించకుండానే రెవెన్యూ అధికారులు ఫౌతి చేశారు. అప్పటినుంచి రైతు బంధు రాలేదు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన పోచయ్యకు అసలు విషయం తెలిసింది. ధరణిలో ఇలాంటి పొరపాట్లు జరిగినప్పుడు మార్పు చేయడానికి ఆప్షన్లు లేవు. స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. అప్పటి నుంచి పోచయ్య తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవటంతో పోచయ్య పురుగుమందు డబ్బాతో కార్యాలయానికి వచ్చి ఆవేదన వెలిబుచ్చారు. తహసీల్దార్ బాలరాజు ఇతర రెవెన్యూ అధికారులు ... విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని భూమిని తిరిగి పోచయ్య పేరు మీదికి మారుస్తామని నచ్చచెప్పారు. బాధితుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇంటి పేర్లు, ఆయన పేరు, తండ్రి పేరు ఒకేవిధంగా ఉండటంతో నాడు చనిపోయిన వ్యక్తిది బదులు ఈ పోచయ్యది ఫౌతీ అయిందని తహసీల్దార్ చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పోచయ్య భూమిని రికార్డుల్లో సరిచేస్తామన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పురుగు మందు డబ్బాతో పోచయ్య, కుటుంబ సభ్యుల నిరసన

ఇంతి ఆర్థికాభివృద్ధి.. సుస్థిర ప్రగతి

ఫలితాలు అందిస్తున్న పీఎంకేఎస్‌వై

న్యూస్‌టుడే, సిద్దిపేట, చిన్నకోడూరు: మహిళల ఆర్థికాభివృద్ధి.. వ్యవసాయంలో సుస్థిర ప్రగతి.. భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా పీఎంకేఎస్‌వై (ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన)ని ప్రవేశపెట్టారు. అందులో భాగంగా సమీకృత వాటర్‌షెడ్ నిర్వహణ కింద చిన్నకోడూరు మండలంలోని తొమ్మిది గ్రామాలను ఎంపిక చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్యాచరణ అమలవుతోంది. ఐదేళ్ల వ్యవధిలో మొత్తం ప్రాజెక్టు వ్యయం కింద రూ.10.66 కోట్లు కేటాయించారు. చిన్నకోడూరు మండలం అల్లీపూర్, చౌడారం, మేడిపల్లి, విఠలాపూర్ రెవెన్యూ గ్రామాలు సహా వాటి పరిధిలోని కిష్టాపూర్, మైలారం, ఎల్లాయపల్లి, చెల్కలపల్లి, రంగాయపల్లిని ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ జనాభా, భూగర్భ నీరు తక్కువగా ఉండటం, గుట్టల ప్రాంతం, తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఆయా గ్రామాలను ప్రాజెక్టు పరిధిలోకి తెచ్చారు. కేంద్రం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చిస్తోంది. ప్రధానంగా 49 శాతం మేర నిధులు చెక్‌డ్యాంలు, ఇంకుడుగుంతల నిర్మాణం, 15 శాతం వ్యవసాయ ఉత్పత్తులపై రాయితీ, మరో 15 శాతం జీవనోపాధి కల్పన, 2 శాతం అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కేటాయిస్తున్నారు.

చేపట్టిన పనులు

ఏడు చెక్‌డ్యాంలు, 15 ఊట కుంటలు

4 ఊట కుంటల పునర్నిర్మాణం

100 రాళ్ల కట్టలు

రూ.50 వేల చొప్పున 311 మందికి రుణాలు

వెచ్చించింది రూ.2.73 కోట్లు

గ్రామీణాభివృద్ధి సంస్థ నేతృత్వంలో ఈ పథకం కింద స్త్రీనిధి ద్వారా పేద మహిళలకు పావలా వడ్డీపై రుణాన్ని అందిస్తున్నారు. ఇప్పటి వరకు జీవనోపాధుల పెంపుదల కింద స్త్రీనిధి రుణాలు రూ. 1.52 కోట్లు, సహజ వనరుల అభివృద్ధికి రూ.1.21 కోట్లు వెచ్చించారు. అంతిమంగా ఆయా గ్రామాల రూపురేఖలు మార్చేందుకు ఈ పథకం దోహదం చేయనుందని ప్రాజెక్టు అధికారి నూరుద్దీన్, డీఆర్డీవో జయదేవ్‌ఆర్య వివరించారు.

కుటుంబ పోషణ సులువు:



గ్రామంలో ఇంటి వద్ద కిరాణా దుకాణం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నా. ఏడాది కింద రూ.50 వేలు రుణం తీసుకొని విస్తరించా. ఆదాయం కొంత మేర పెరిగింది. నెలకు రూ.12 వేల వరకు సమకూరుతోంది. మాది వ్యవసాయ కుటుంబం. భర్త, ఇద్దరు పిల్లలతో సహా మొత్తం నలుగురు కుటుంబ సభ్యులం. కిరాణా దుకాణం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ సులువుగా మారింది. మమత, విఠలాపూర్

హోటల్‌ను అభివృద్ధి చేశాం:

విజయలక్ష్మి, కిష్టాపూర్



కుమారుడు దీపక్‌తో కలిసి హోటల్ నిర్వహిస్తున్నా. స్త్రీనిధి కింద ఈ ఏడాది మార్చిలో రూ.50 వేలు రుణం తీసుకున్నా. వాయిదాల రూపంలో రుణం చెల్లించే సదుపాయం కల్పించారు. ప్రతి నెలా రూ.25 వేలు ఆదాయం సమకూరుతోంది. నెలనెలా రూ.2500 రుణం తిరిగి చెల్లిస్తున్నా.

సవాళ్ల పర్వం.. ఎన్నాళ్లకు పరిష్కారం?

ఎదురు చూస్తున్న నిర్వాసితులు

న్యూస్‌టుడే, గజ్వేల్:

'మల్లన్న సాగర్ నిర్వాసితులకు మీరేం చేయలేదు.. మేమే మార్గం చూపుతాం' : రాష్ట్ర ప్రభుత్వం

'సకల సౌకర్యాలు కల్పించాం. మిగిలిన కొన్ని సమస్యలు పరిష్కరించండి' : ప్రతిపక్షం

మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కార అంశంపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియాలోని సంగాపూర్-ముట్రాజ్‌పల్లి గ్రామాల మధ్య కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్రాజెక్టుకు భూసేకరణపై చూపిన శ్రద్ధ సదుపాయాలు కల్పించటంలో చూపలేదని వాపోతున్నారు. సంగాపూర్, ముట్రాజ్‌పల్లి సమీపంలో దాదాపు 600 ఎకరాల్లో గ్రామాలను పునర్ నిర్మించారు. పలువురికి రెండు పడకగదుల ఇళ్లు కేటాయించగా కొందరు ఇంటి స్థలాలు తీసుకుని నిర్మించుకుంటున్నారు. కాలనీల్లో మురుగు కాల్వల నిర్వహణ సరిగా లేదు. శిథిలమయ్యాయి. మురుగు కాల్వల్లో చెత్త పేరుకుంది. రోడ్లను సీసీలుగా మార్చాల్సి ఉంది. తాగు నీటి ట్యాంకుల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. బస్తీదవాఖానాలు, అంగన్వాడీలు నిర్మించినా అవి వినియోగంలోకి తీసుకురాకపోవటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికలు లేవు. ఇళ్ల మధ్యనే మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తున్నారు. ఖననం చేయాల్సిన మృతదేహాలను బంధువుల గ్రామాలకు తరలిస్తున్నారు.

గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలో..

గ్రామం	కుటుంబాలు
ఏటిగడ్డకిష్టాపూర్	1253
లక్ష్మాపూర్	388
వేములఘాట్	1252
పల్లెపహాడ్	921
బంజేరుపల్లి	267
ఎర్రవల్లి	800
సింగారం	330
తాండ	120

వినతులిచ్చినా అంతే

గ్రామాల్లో చాల మందికి పూర్తి స్థాయిలో పరిహారం రాలేదంటున్నారు. ఒక వేములఘాట్‌లో చూస్తే.. ఇప్పటిదాకా గ్రామంలో 800 ఇళ్ల స్థలాలు, 408 ఇళ్లు మాత్రమే ఇచ్చారు. గత వారం వృద్ధులు కలెక్టరేట్‌కు వెళ్లి వినతులిచ్చారు. 18 సంవత్సరాల వయస్సు దాటిన వారు, 65 సంవత్సరాలు దాటిన వారికి రావాల్సిన రూ.7.50 లక్షల ప్యాకేజీ ఇప్పటివరకు ఇవ్వటం లేదన్నారు. కొండపోచమ్మ సాగర్ నిర్మాణం సందర్భంగా నిర్వాసితులుగా మారిన మామిడ్యాల, బహిరంపూర్, తానేదార్‌పల్లి, తండా గ్రామాలను తునికిబొల్లారం సమీపంలో పునర్నిర్మించారు. ఇక్కడ 1328 కుటుంబాలున్నాయి. ఇక్కడా సమస్యలు తీర్చాల్సి ఉంది.



సీసీ వేయకుండా కంకరపోసి వదిలిపెట్టిన పల్లెపహాడ్‌లోని వీధి

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సిద్దిపేట అర్బన్: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సిద్దిపేట హౌజింగ్‌బోర్డు కాలనీ, ఎంఎల్ఏ కార్యాలయం, ప్రియదర్శినినగర్, హరిప్రియ నగర్, టీచర్స్ కాలనీల్లో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

అసత్య ప్రచారాలపై అఘోరి ఫిర్యాదు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో తనను అరెస్టు చేసినట్లు అసత్య ప్రచారం చేసిన వ్యక్తులు, యూట్యూబ్ ఛానళ్లపై పోలీసులు చర్యలు తీసుకోవాలంటూ అఘోరి (శివవిష్ణు బ్రహ్మ) సిద్దిపేట పట్టణ మూడో ఠాణాలో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. సీఐ విద్యాసాగర్, అఘోరి తెలిపిన వివరాలు.. మంచిర్యాల జిల్లా కృష్ణపల్లికి చెందిన శివవిష్ణు బ్రహ్మ గత కొంతకాలంగా అఘోరిగా జీవనం సాగిస్తున్నారు. దుద్దెడ టోల్ గేట్ సమీపంలో తనను అరెస్టు చేసినట్లు యూట్యూబ్‌లో దుష్ప్రచారం జరుగుతోందన్నారు. ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.



నేనేం తప్పు చేశానమ్మా..
నెలల పాటు గర్భంలో
నన్ను మోశావు..
ఈ లోకంలోకి తీసుకొచ్చి అనాథగా
వదిలేశావు..
జన్మనిచ్చిన నిన్ను కళ్లారా చూసుకునే
అవకాశమే ఇవ్వలేదు..
అన్నింటినీ నేర్పించే అమ్మ ఒడిని దూరం చేశావు..
నెలలు నిండకుండానే పుట్టడం నా తప్పు కాదుగా..
అయినా దిక్కులేని వాణ్నిగా వదిలేశావని..
ప్రశ్నిస్తున్నాడు ఈ నవజాత శిశువు. సిద్దిపేట పట్టణంలో జరిగిన ఈ ఘటన చూపరులను కంటతడి పెట్టించింది.

నెలలు నిండకుండా పుట్టడం నా తప్పా?

నవజాత శిశువును ఊయలలో వదిలెళ్లిన తల్లి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మగశిశువును వదిలేసి వెళ్లిపోయారు. రోగుల బంధువులు కొంతసేపటికి చూసి వైద్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే శిశువును అత్యవసర చికిత్సకు తరలించారు. నెలలు నిండకముందే పుట్టాడని కేవలం 900 గ్రాముల బరువు మాత్రమే ఉన్నాడని, ఆయాసంతో బాధపడుతున్నాడని.. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సురేశ్‌బాబు తెలిపారు. పసిబిడ్డకు సీపాప్ ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. వైద్యులు రాగిణి, నిఖిత ఆస్పత్రి సిబ్బంది ఆలియా, ఖాజాబీ బాగోగులు చూస్తున్నారు. వైద్యులిచ్చిన సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు రాము, రాజారాం వచ్చి పరిశీలించారు. శిశువు ఆరోగ్యం కుదుట పడ్డాక శిశుగృహకి తరలిస్తామన్నారు.

కాపాడిన 'ఊయల'

కొంతమంది తల్లులు పిల్లలను చెత్తకుండీలు, ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిన ఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దిపేటలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేసిన ఓ ఆలోచన పసిప్రాణాన్ని కాపాడింది. చిన్నారులను పెంచలేకపోతే.. ఎక్కడో పారేయకుండా ఆవరణలో ఊయలలో వేయండి.. అని ఆసుపత్రి వద్ద ఫ్లెక్సీ రాసి పెట్టారు. ఇప్పుడే ఆ నవజాత శిశువుకు తల్లి ఒడి అయింది.



పరీక్షిస్తున్న వైద్యుడు

గంజాయిని.. వేళ్లూనుకోనివ్వద్దు!



న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, వెల్దుర్తి, సిద్దిపేట, మెదక్, వికారాబాద్, రామాయంపేట

గంజాయి సాగు.. సరఫరా.. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో నిత్యకృత్యంగా మారింది. ఆబ్కారీ యంత్రాంగం తనిఖీలు చేసున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. దొరికితే దొంగ.. లేదంటే రాజా అన్న చందంగా దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆరోగ్యానికి హాని చేసే ఈ మత్తుకు యువత, కార్మికులు, విద్యార్థులు ఆకర్షితులవుతూ జీవితాలను పణంగా పెడుతున్నారు. కొన్ని ముఠాలు ఆయా వర్గాల లక్ష్యంగా చేసుకొని పొట్లాలు, చాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. పలు సందర్భాల్లో ఇది రూఢీ అయింది. ఈ తరుణంలో దీని కట్టడే లక్ష్యంగా అడుగేయాల్సిన అవసరం ఉంది.

గట్లపై సాగు..



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శెట్టిపల్లికలాన్‌లో ఎలబోయిన భూపాల్ పొలంలోని గట్లపై గంజాయి మొక్కలు సాగు చేశాడు. విశ్వసనీయ సమాచారంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు.

ప్రమాదంలో బయటపడి..



హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న ఓ కారు మెదక్ జిల్లా రామాయంపేట శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. పోలీసులు దాన్ని గుర్తించి తనిఖీ చేయగా 80 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.

తగ్గి.. మళ్లీ పెరిగి..

2014కు ముందు సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అత్యధికంగా గంజాయి సాగు చేసేవారు. అప్పటి ప్రభుత్వం స్వయం ఉపాధి కింద రుణాలు ఇచ్చి రైతులను సాగు మాన్పించేలా చేసింది. మళ్లీ ఇటీవల దీని సాగు పెరిగింది. ఇటీవల నాలుగు జిల్లాల్లోని నారాయణఖేడ్, రాయికోడ్, మునిపల్లి, న్యాల్‌కల్, వెల్దుర్తి తదితర మండలాల్లో ఆబ్కారీ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పలువురు పొలం గట్లపై సాగు చేస్తుండటం ఆందోళనకు గురిచేసే అంశం. సాగుకు విత్తనాలు ఒడిశా, విశాఖ ఏజెన్సీ నుంచి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలో 46 మంది రైతులకు ఈ కారణంగానే రైతుబంధు నిలిపివేశారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీ, ఒడిశా నుంచి జిల్లాల మీదుగా సరఫరా అవుతోంది. అమ్రాక్యులు ఎండు గంజాయిని పొట్లాలుగా తయారుచేసి పోలీసుల కళ్లుగప్పి రవాణా చేస్తున్నారు.

నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గంజాయి సాగు, అక్రమ దందా నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాం. జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేషన్ హౌస్ అధికారి ఆధ్వర్యంలో తరచూ తనిఖీలు చేపడుతున్నాం. అదనంగా చెక్‌పోస్టుల ఏర్పాటు, సరిహద్దులో నిఘా ద్వారా కట్టడి చేస్తున్నాం.

– నవీన్ చంద్ర, జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి, సంగారెడ్డి

నాలుగు జిల్లాల్లో గంజాయి కేసులు (జనవరి నుంచి గత సెప్టెంబరు 30 వరకు)

జిల్లా	కేసులు	అరెస్టైంది	స్వాధీనం చేసుకున్న మొక్కలు	దొరికిన ఎండు గంజాయి	విలువ
సంగారెడ్డి	71	108	441	620.16 కిలోలు	రూ. 15,50,4,000
సిద్దిపేట	02	03	26	240 గ్రాములు	రూ. 29,625
మెదక్	14	20	57	1.185 కిలోలు	రూ. 2,60,890
వికారాబాద్	73	148	45	140 కిలోలు	రూ. 6,10,000

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వేల్లిలో ఒకరు తన పొలంలో పత్తి, మిరప అంతర పంటగా గంజాయి సాగు చేశాడు. విషయం తెలుసుకున్న ఆబ్కారీ పోలీసులు 20 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. న్యాల్‌కల్‌లోనూ ఇలాంటి ఘటనే జరిగింది.

కొత్త పద్ధతుల్లో..



కూరగాయల వాహనం దిగువన...

నాలుగు జిల్లాల్లో జిన్నారం, ఐడీఏ బొల్లారం, హత్నూర, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, చేగుంట, తాండూరు తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో నివసిస్తున్న ఇతర రాష్ట్రాల వారికి పలువురు గంజాయి సరఫరా చేస్తున్నారు. దీన్ని సాగు చేస్తే సులభంగా సరఫరా చేయడంతో పాటు డబ్బులు సంపాదించవచ్చని పలువురు సాగు బాట పట్టారు.

- ఆబ్కారీ, సివిల్ పోలీసులకు అనుమానం రాకుండా వాహనాల్లో అరలు తయారు చేసి అందులో తరలిస్తున్నారు.

చైతన్యం.. అధ్యయనం..

న్యూస్‌టుడే,సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, సదాశివపేట, కంది



శ్రమదానం చేస్తున్న విద్యార్థినులు

వారంతా నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు.. సామాజిక అంశాలపై చైతన్యం తేవడమే లక్ష్యంగా, గ్రామీణుల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు గ్రామాల బాట పట్టారు. అక్కడే ఉంటూ ప్రజలతో మమేకం అయ్యారు. వ్యాధులు, పోషక లోపం, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై పల్లెవాసుల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. మరోవైపు గ్రామాన్ని శుభ్రం చేశారు. సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించడం విశేషం.

128 మంది విద్యార్థులు..

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 128 మంది విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా ఈ నెల 16 నుంచి 22 వరకు సంగారెడ్డి మండలం ఫసల్‌వాదికి వచ్చారు. అధ్యాపకుల పర్యవేక్షణలో సామాజిక సేవలో పాల్గొన్నారు. రోజువారీగా కార్యక్రమాలు చేపట్టారు.

గ్రామీణ జీవనంపై సర్వే..

గ్రామీణుల జీవనాన్ని తెలుసుకునేందుకు ముందుగా సర్వే చేశారు. ఏ పంట ఎంత మంది పండిస్తున్నారు, రోగాల తీరు, ప్రధాన సమస్యలు, తాగునీటి లభ్యత, తదితర వివరాలపై సర్వే చేశారు. ఆయా వివరాలను సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. స్థానిక చెరకు కర్మాగారాన్ని సందర్శించారు. దిగుబడి, చక్కెర ఉత్పత్తి తీరు, తదితర అంశాలు తెలుసుకున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

భూసార పరీక్షల ప్రాధాన్యాన్ని రైతులకు వివరించారు. రసాయనాల వినియోగంతో కలిగే నష్టాలు, సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తుమందు ఇతర వాటితో కలిగే అనర్థాలపై ర్యాలీలు నిర్వహించారు. ఈ మేర అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ పెంచేలా ప్రోత్సహించారు. వ్యవసాయ, ఉద్యాన, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలతో సూచనలు ఇప్పించారు.

ఎన్నో విషయాలు తెలుసుకున్నా

– ఎస్.అజయ్‌కుమార్, విద్యార్థి



క్షేత్రస్థాయిలో ఎన్నో విషయాలు తెలుసుకున్నా. గ్రామంలో అత్యధికంగా వరి, పత్తి, చెరకు, కూరగాయలు సాగు చేస్తున్నారు. మంజీర నది పరివాహక ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. ప్రజల జీవనస్థితిగతులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది.

సంతోషంగా ఉంది

– బి.సుష్మస్వరాజ్, విద్యార్థిని



సామాజిక సేవలో పాల్గొనడం సంతోషంగా ఉంది. నాలుగేళ్లుగా తరగతి గదులకు పరిమితం అయ్యాం. తొలిసారిగా పల్లెటూరికి వచ్చి ఇక్కడి వారి జీవన స్థితిగతులు తెలుసుకున్నా. పలు అంశాలపై అవగాహన కల్పించాను.



ఐఎస్‌వో ధ్రువపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

సిద్దిపేట: సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఐఎస్‌వో గుర్తింపును పొందింది. పచ్చదనం, విద్యా బోధన, పాలన, వసతులు, ఈ-వ్యర్థాల నిర్వహణ, ఇతర అంశాల ప్రాతిపదికన మూడు ఐఎస్‌వో ధ్రువపత్రాలను మంగళవారం అందుకున్నారు. ఆయా అంశాలపై ఐఎస్‌వో బృందం ప్రత్యక్షంగా తనిఖీ చేసి ప్రదానం చేయడం విశేషం. ప్రిన్సిపల్ జీవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

సైక్లింగ్‌లో సత్తా చాటిన అన్నాదమ్ముళ్లు



అందుకున్న పతకాలు, సర్టిఫికెట్లతో అమిత్, సుమిత్

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లికి చెందిన అన్న, తమ్ముడు ఇద్దరు సూరంపల్లి అమిత్, సుమిత్ సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 8వ రాష్ట్ర స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలు గత వారం జరిగాయి. అండర్-16 బాలుర వ్యక్తిగత 5 కి.మీ విభాగంలో అమిత్ విజేతగా నిలిచి బంగారు పతకం, సుమిత్ రెండో స్థానంతో రజత పతకం సాధించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. ఇద్దరినీ సైక్లింగ్, యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లారెడ్డి, మనోహర్, సాయ్ డైరెక్టర్ చంద్రారెడ్డి, విజయకాంతారావు, కోచ్‌లు విజయభాస్కర్‌రెడ్డి, సంజీవ్ అభినందించారు.

పిల్లల పండగ గోడపత్రిక ఆవిష్కరణ



జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ పట్టణంలో నవంబర్ 10న 'జహీరాబాద్ పిల్లల పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కన్వీనర్ డా.విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని శ్రామిక విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పిల్లల పండగ గోడపత్రికను విజ్ఞాన కేంద్రం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. మూడు కేటగిరీల్లో 30కి పైగా ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు రాంచందర్, శివబాబు, మహిపాల్, వెంకటేష్, పూలమ్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సస్యరక్షణపై అవగాహన

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కంది, శనగ సాగులో సేంద్రియ సస్యరక్షణ చర్యలు మేలని జహీరాబాద్ డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం పంటల యాజమాన్యం శాస్త్రవేత్త డా. రమేష్ అన్నారు. మండలంలోని ఒంటెలగడ్డ తండా, జీడిగడ్డ తండాలో మంగళవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కంది, శనగ పైరుల్లో లింగాకర్షణ బుట్టలు, వేప నూనె కషాయం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రాణం తీసుకుని వేదన మిగిల్చి..

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని యువతి..



అర్చన

జగదేవపూర్: ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ జనార్దన్ తెలిపిన వివరాలు.. దాసరి అర్చన (18) గజ్వేల్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమిస్తోంది. విషయం గ్రహించిన తల్లిదండ్రులు మరో సంబంధం వెతికి పెళ్లికి ఒప్పించారు. అర్చన తల్లిదండ్రులు మంగళవారం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి తలుపు పెట్టి ఉంది. స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరేసుకొని మృతి చెంది కనిపించింది. యువతికి తల్లిదండ్రులు, ఇద్దరు అక్కాచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉన్నారు. ఈ కుటుంబంలో అర్చన ద్వితీయ సంతానం. తల్లి మల్లమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

భూమి ఇవ్వలేదని మనస్తాపానికి గురై..

సదాశివపేట: మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తంగెడిపల్లిలో రెండు రోజుల కిందట జరిగింది. మంగళవారం వెలుగులోకి వచ్చింది. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన సిరిపురం రాములు(33)తన వాటాకు చెందిన భూమి ఇవ్వాలని తల్లితండ్రులను కోరినా ఇవ్వలేదు. బావ, చెల్లెలు కూడా అంగీకరించలేదు. దీంతో మనోవేదనకు గురై గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో పెద్దల సమక్షంలో భూ పంచాయతీ తేల్చేవరకు మృతదేహాన్ని తరలించవద్దని రాములు బావమరిది పట్టుబట్టాడు. దీంతో రెండు రోజులుగా మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచారు. మంగళవారం పెద్దల సమక్షంలో ఒప్పందం కుదరడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యానికి బానిసై యువకుడు..

కల్హేర్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన నిజాంపేట్ శరత్(30) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశం తెలిపారు. శరత్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గ్రామంలో మెడికల్ దుకాణం పెడతానని, డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. గతంలో చేయి కోసుకొని బెదిరించాడు. సోమవారం సాయంత్రం మరోసారి డబ్బులు డిమాండు చేయగా వారు అంగీకరించలేదు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం శరత్‌ను నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై వివరించారు. తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అభినవ.. డ్రోనాచార్య!

ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి: ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతుంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విభిన్న అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతో పాటు భవిష్యత్తు మార్గసూచీపై ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు భారీగా పాల్గొన్నారు.



సొంతంగా ఎదగాలనే స్టార్టప్

– పురంధర్, ఎంటెక్, ఐఐటీ హైదరాబాద్

నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ నెలకొల్పాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివాక హైదరాబాద్ ఐఐటీలో ఇటీవలే ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశా. ఐఐటీ ప్రాంగణంలో ఉన్న టింకర్స్ ల్యాబ్‌లో ఎక్కువ సమయం గడిపా. అక్కడ సొంతంగా రోబోటిక్ చేయి తయారీకి చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ల ప్రాజెక్టుకు 'ఆమని ఆటోమేషన్', కృత్రిమ మేధస్సుకు 'ఎక్స్ నుపిల్' అనే స్టార్టప్స్ ఏర్పాటు చేశాను. డ్రోన్ల వేగం నియంత్రణకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఈఎస్‌సీ) పరికరాలు సొంతంగా తయారుచేస్తున్నా. నిపుణుల బృందం సహకారంతో ఆర్డర్లు తీసుకుని సరఫరా చేసున్నా. వచ్చిన లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపై దృష్టి సారిస్తా. సాంకేతిక పరిజ్ఞానంతో బయోడీజిల్ తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

పట్టణ ప్రణాళికకు డ్రోన్ సర్వే

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి, తాండూరు



వికారాబాద్ పట్టణంలో సర్వే ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల తదితరులు

పట్టణ రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేసింది. ఇందుకు పట్టణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధిత అధికారులు సాధారణంగా అన్ని వార్డులు తిరిగి సర్వే చేపడుతుంటారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం కొత్తగా డ్రోన్ ద్వారా సర్వేకు శ్రీకారం చుట్టడం విశేషం. జిల్లాలోని వికారాబాద్, తాండూరు పురపాలికల్లో ఆధునిక సాంకేతికను వినియోగిస్తుండటం విశేషం.

10 రోజుల పాటు..

వికారాబాద్‌లో ఈ నెల 16న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే ప్రారంభించారు. పట్టణంలో ఈనెల 25 వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు గాను 2 డ్రోన్లు వినియోగిస్తున్నారు. 5 మంది సాంకేతిక, 10 మంది పుర సిబ్బంది రెండు బృందాలుగా వీడి ఇందులో పాల్గొంటున్నారు. వికారాబాద్ 122 కి.మీ. మేర విస్తరించి ఉండగా, క్లస్టర్లుగా విభజించి

జిల్లాలో ఇలా

పురపాలిక	జనాభా	వార్డులు
తాండూర్	71,008	38
వికారాబాద్	63,646	34
పరిగి	18,242	15
కొడంగల్	14,519	12

క్రోడీకరించి నివేదిక..

కేంద్రం అమృత్ 2.0 కింద డ్రోన్ కెమెరాలతో సర్వేకు ఎంపిక చేసింది. వీటి ద్వారా సేకరించిన సమాచారం, చిత్రాలను క్రోడీకరించి నివేదిక రూపొందిస్తారు. రానున్న 30-40 ఏళ్లలో అభివృద్ధికి తగ్గట్టుగా ప్రణాళిక తయారుచేస్తారు. ప్రస్తుతం ఏళ్ల కిందట రూపొందించిన మాస్టర్ ప్లానే ఇప్పటికీ కొనసాగుతోంది. పట్టణానికి కొత్త రూపు వచ్చేందుకు డ్రోన్ సర్వే దోహదపడనుంది. అభివృద్ధికి డ్రోన్ యంత్రం చిత్రాల బేస్ మ్యాప్ కీలకంగా మారనుంది. ఇప్పటికే వికారాబాద్, పరిగిలో ఈ కొత్త సర్వే మొదలవగా, తాండూరులో 26 నుంచి చేపట్టనున్నారు. 2050ని దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారు.

100 పాయింట్లు నిర్దేశించారు. అక్కడి నుంచి డ్రోన్ సాయంతో దాని పరిధిలోని ప్రాంతాన్ని చిత్రీకరిస్తారు. ఎక్కడ రోడ్డు, ఖాళీ ప్రదేశం ఉంది, నిర్మాణాలు ఎక్కడ ఉన్నాయి, ప్రభుత్వ కార్యాలయాలు, వీధి దీపాలు, పార్కులు, తాగునీటి పైపులైన్లు, సెల్ టవర్స్, తాగునీటి రిజర్వాయర్లు, వైకుంఠధామం, తదితర వాటన్నింటినీ సేకరించి బేస్ మ్యాప్ రూపొందిస్తారు.

క్షుణ్నంగా పరిశీలించి.. రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్

పట్టణంలో డ్రోన్ యంత్రాలతో ఈనెల 25 వరకు సర్వే నిర్వహిస్తారు. అన్ని అంశాలను క్షుణ్నంగా పరిశీలించి నివేదిక రూపొందిస్తాం. రానున్న 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని తయారుచేయనున్నాం. ఆ మేర అభివృద్ధి చేయాల్సిన తీరుపై విశ్లేషిస్తాం.

రైతులను బలిగొన్న విద్యుత్తు తీగ



విద్యుత్తు తీగ తగిలి మృతిచెందిన శివశంకర్

వట్‌పల్లి, న్యూస్‌టుడే: అడవి పందుల బెడద నుంచి వరి పంటను కాపాడుకునేందుకు వేసిన విద్యుత్తు తీగ యమపాశమై పోతులబోగుడ గ్రామానికి చెందిన రైతు ఎం.శివశంకర్(30)ను బలిగొంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. శివశంకర్ ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. అడవి పందులు పంటను ధ్వంసం చేస్తుండటంతో వాటిని నియంత్రించేందుకు పొలం చుట్టూ విద్యుత్తు తీగతో కంచె ఏర్పాటు చేశారు. కాపలా కోసం సోమవారం రాత్రి ఇంటి నుంచి చేనుకు వెళ్లారు. మంగళవారం ఇంటికి రాకపోవడంతో ఆటో నడపడానికి వెళ్లారేమోనని కుటుంబసభ్యులు భావించారు. సాయంత్రం వరకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లి పరిశీలించగా పంట రక్షణకు వేసిన తీగకు తగిలి విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మరమ్మతులు చేస్తూ లైన్‌మెన్..



నవీన్

ఝరాసంగం: నియంత్రికకు మరమ్మతులు చేస్తున్న ఓ లైన్‌మెన్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చీల్కేపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. జహీరాబాద్ మండలం హుగ్గెల్లికి చెందిన నవీన్ (34) మూడేళ్లుగా చీల్కేపల్లిలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉపకేంద్రం నుంచి లైన్‌క్లియర్ తీసుకుని నియంత్రిక వద్ద ఫ్యూజ్ తీగను సరిచేస్తున్నాడు. ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కాగా షాక్ కొట్టి కిందపడ్డాడు. తలకు చెట్టుకొమ్మ బలంగా తగిలింది. అధికారులు వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి రెండేళ్ల పాప, నాలుగు నెలల బాబు ఉన్నాడు. ఎస్ఐ నరేశ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

వాహనం అదుపుతప్పి.. రైతు దుర్మరణం



అశోక్

ములుగు, న్యూస్‌టుడే: అత్తగారింటికి వెళ్లిన ఓ రైతు తిరిగివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కుక్‌కు చెందిన అచ్చంగారి అశోక్ (38), సునీత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దామోదర్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం అత్తగారి ఊరు జగదేవపూర్ మండలం రాయవరం గ్రామానికి శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అదే రోజుగా తిరుగు ప్రయాణం కాగా, అంగడి కిష్టాపూర్ గ్రామం వద్ద వాహనం అదుపు తప్పడంతో స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందాడు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



కృష్ణ

నిజాంపేట(రామాయంపేట), న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు శవమై కనిపించాడు. ఈ ఘటన నిజాంపేట మండల పరిధి కల్వకుంటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. . కల్వకుంటకు చెందిన ముష్టిగొల్ల కృష్ణ(32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన కృష్ణ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం వెతుకుతుండగా గ్రామ శివారులోని చెట్టు కింద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య మంజుల, పిల్లలు ఉన్నారు. తల్లి బాలమణి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125–00	డ్రెస్డ్	213–00
రిటైల్ 147–00	స్కిన్‌లెస్	243–00

మహిళ ప్రాణం తీసిన విద్యుత్తు కంచె



బుజ్జిబాయి

కౌడిపల్లి: పంట రక్షణకు బిగించిన విద్యుత్తు కంచె తగిలి మహిళ దుర్మరణం చెందిన ఘటన కౌడిపల్లి మండలం జాజి తండాలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తండాకు చెందిన కాట్రోత్ బుజ్జిబాయి(38) వ్యవసాయంతో పాటు మేకల పెంపకంతో జీవనం సాగిస్తోంది. మంగళవారం అడవి పందుల రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ వైర్‌కు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి తీయకుండా అలాగే ఉంచారు. విషయం తెలియక పక్కనే మేకలు మేపుతున్న బుజ్జిబాయి.. అవి పొలంలోకి వెళ్లడంతో వాటితో పాటు ఆమె వెళ్లి విద్యుదాఘాతానికి గురైంది. రెండు మేకలతో పాటు బుజ్జిబాయి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని తరలించకుండా తండావాసులు అడ్డుకున్నారు. ప్రమాదానికి కారణమైన వారిని ఘటనా స్థలానికి రప్పించాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు పోలీసులు నచ్చజెప్పి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

క్లోరినేషన్, శానిటేషన్‌తోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న డీపీవో దేవకీదేవి

నంగునూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో క్లోరినేషన్, శానిటేషన్ చేపడితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకు పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) దేవకీదేవి పేర్కొన్నారు. మంగళవారం నంగునూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డీపీవో అధ్యక్షతన మండల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం 11.20 గంటలకు సమావేశం ప్రారంభమైనా 23 మందికి 11 మంది పంచాయతీ కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. సకాలంలో ఎందుకు హాజరు కావడం లేదని ఎంపీడీవో లక్ష్మప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీవో మాట్లాడుతూ.. ఈనెల 24 లోపు అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఏవో గీత, ఏపీఎం మహిపాల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో దేవరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ రమేశ్ గౌడ్, తహసీల్దార్ సరిత, ఎంపీపీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సిద్దిపేట, న్యూస్‌టుడే: మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద సిద్దిపేటలో జ్యూట్ బ్యాగుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రుతి సంస్థ నిర్వాహకులు డా.జి.సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులకు వ్యాపారం, నైపుణ్యాభివృద్ధిపై 30 రోజులపాటు తరగతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి నం.94949 59108 సంప్రదించాలని కోరారు.

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


విద్యార్థులతో మాట్లాడుతున్న డా.శాంతి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మానసికపరమైన సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయొద్దని, వెంటనే వైద్యులను సంప్రదించాలని సిద్దిపేట సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శాంతి అన్నారు. మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ముర్షద్‌గడ్డలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సమీపంలోని బాలసదనం, శిశుగృహాలను సందర్శించారు. అక్కడి చిన్నారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో డీసీపీవో రాము, తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయిస్తేనే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలరని హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కందుల కౌసల్య అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడి నిర్మూలనపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కరుణాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బస్‌పాసుల పంపిణీ

సిద్దిపేట: సిద్దిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభయజ్యోతి మనోవికాస కేంద్రం పరిధిలోని వివిధ ప్రతిభావంతులకు ప్రత్యేక బస్‌పాస్‌లను దాత రాజేందర్ సహకారంతో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 58 మంది విద్యార్థులకు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వర్ చేతుల మీదుగా అందజేశారు.

‘అధ్యాపక వృత్తికి రాజీనామా చేస్తా’

తెలంగాణచౌక్(కరీంనగర్): రాబోయే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండేందుకు, తాను ఈనెల 28న అధ్యాపక వృత్తికి రాజీనామా చేస్తున్నట్లు పులి ప్రసన్న హరికృష్ణ తెలిపారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం గుండనపల్లికి చెందిన తాను 16 ఏళ్లుగా బోధనా వృత్తిలో ఉన్నానని చెప్పారు. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నానని చెప్పారు. విన్నర్స్ పబ్లికేషన్ గౌరవ సలహాదారుగా, పోటీ పరీక్షల నిపుణుడిగా, మార్గనిర్దేశం ఇవ్వడం లాంటివి చేశానని తెలిపారు.

పనుల్లో జాప్యం.. సమస్యలు నిత్యం

రహదారి విస్తరణతో పట్టణవాసుల అవస్థలు


బాలాజీ కూడలిలో నిలిచిన మురుగు

న్యూస్‌టుడే, చేర్యాల: అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడంతో చేర్యాల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుద్దెడ క్రాస్ రోడ్డు నుంచి చేర్యాల మీదుగా జనగామ వరకున్న 365బీ జాతీయ రహదారి విస్తరణ పనులు రెండేళ్ల కిందట మొదలై ఇంకా కొనసాగుతున్నాయి. ముందుగా రోడ్డుకు ఇరువైపులా మురుగుకాలువ పనులు పూర్తిచేసి, వెంటనే విద్యుత్తు స్తంభాలు పాతి మంచినీటి పైపులు వేశాక రహదారి పనులు చేస్తే ఏ సమస్య ఉండేది కాదు. అలా కాకుండా ఓ వైపు కాలువ, మరో వైపు మంచినీటి పైపులు వేయడం, ఇంకోవైపు రహదారి పనులు చేస్తుండటంతో అన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. అస్తవ్యస్తంగా మారిన జాతీయ రహదారి పనులతో పట్టణవాసులు పడుతున్న ఇబ్బందులపై కథనం..

ఎక్కడి పనులు అక్కడే

పట్టణంలో విద్యుత్తు స్తంభాలు సగానికి పైగా రహదారిపై, మురుగు కాలువల మధ్యలోనే వదిలేశారు. పట్టణ పరిధిలో సుమారు నాలుగు కిలోమీటర్లు సైడ్ కాలువ పనులు చేపట్టి మధ్యలో నిలిపివేశారు. ఇలా పట్టణ పరిధిలో 45 చోట్ల కాలువను అసంపూర్తిగా వదిలేయడంతో మురుగునీరు సాఫీగా వెళ్లడం లేదు. దీంతో మురుగు రోడ్లపై ఏరులై పారుతోంది. కొన్ని చోట్ల ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల రోజుల్లో పూర్తి చేస్తాం

– రాజారాం, డీఈఈ(జాతీయ రహదారుల శాఖ)

పట్టణంలో రహదారి విస్తరణ సమస్యగా మారింది. రోడ్డుపై ఉన్న నివాసాల తొలగింపునకు స్థానికులు సహకరించక పోవడంతో జాప్యమైంది. పనులు తుదిదశకు చేరుకున్నాయి. మరో నెల రోజుల్లో పూర్తి చేయిస్తాం.

అడ్డంకులు తొలగిస్తే మేలు

రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువల్లో అక్కడక్కడ వదిలేసిన పనులను తక్షణమే పూర్తి చేయాలి. లేదంటే మురుగుకాలువల్లో అడ్డంగా ఉన్న స్తంభాల వద్ద చెత్త చేరి మురుగు నీరు రోడ్లతో పాటు దుకాణాలు, నివాసాల్లోకి చేరుతుంది. పనులు పర్యవేక్షిస్తున్నవారికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్	9963585053	చేర్యాల 8008574871
జగదేవపూర్	8008573209	
హుస్నాబాద్	8008573520	గజ్వేల్ 9490675047
దుబ్బాక	9030037175	(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, మిరుదొడ్డి, నంగునూరు:

? వీరారెడ్డిపల్లిలో మురుగు కాల్వలు నిండిపోయి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.– ఎల్లయ్య, వీరారెడ్డిపల్లి

✓ కాల్వల్లో పూడిక తీయించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. – గణేష్‌రెడ్డి, ఎంపీడీవో, మిరుదొడ్డి

? కాసులాబాద్ ఎస్సీ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – స్వామి, కాసులాబాద్, మిరుదొడ్డి.

✓ పూర్తిస్థాయిలో వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీకాంత్, విద్యుత్తు శాఖ, ఏఈ మిరుదొడ్డి

? నంగునూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం గేటుకు ఎదురుగా ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు, 108 వాహనానికి ఇబ్బందులు తప్పడం లేదు. – సర్పంచ్‌లు, నంగునూరు

✓ ఆసుపత్రి గేటుకు ఎదురుగా వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకుంటాం. – ఎండీ ఆసిఫ్, రాజగోపాలపేట ఎస్సై

? నంగునూరు నుంచి నాగరాజుపల్లికి వెళ్లే మార్గంలో అంక్షాపూర్ చౌరస్తా సమీపంలో రోడ్డు పక్కన కోళ్ల వ్యర్థాలు విచ్చలవిడిగా వేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి –సత్యం, నంగునూరు

✓ చికెన్ వ్యర్థాలు వేయకుండా దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం –చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి, నంగునూరు

ఆయుధాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం


గజ్వేల్ గ్రామీణ: ఆయుధాల పనితీరును వివరిస్తున్న సీఐ సైదా, పక్కన ఏసీపీ పురుషోత్తం రెడ్డి


హుస్నాబాద్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్, సీఐ శ్రీను

చేర్యాల, దుబ్బాక, తొగుట, కోహెడ, దౌల్తాబాద్, రాయపోల్, న్యూస్‌టుడే: పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది సమక్షంలో సందర్శనకు వచ్చిన ప్రజలకు ఆయుధాల గురించి వివరించారు. గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, ట్రాఫిక్ సీఐ మురళి, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. • ప్రతి ఒక్కరు చట్టాన్ని గౌరవించాలని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ అన్నారు. హుస్నాబాద్ ఠాణా ఆవరణలో సీఐ కొంద్రు శ్రీను, ఎస్ఐ తోట మహేశ్‌తో కలిసి విద్యార్థులకు ఆయుధాల గురించి వివరించారు. • చేర్యాలలో చేర్యాల, మద్దూరు ఎస్సైలు నీరేశ్, షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఠాణా నిర్వహణ, లాకప్ గది గురించి అవగాహన కల్పించారు. • దుబ్బాక ఠాణాలో దుబ్బాక ఎస్సై వి. గంగరాజు, భూంపల్లి, మిరుదొడ్డి ఎస్సైలు హరీశ్, పర్శరాములు ఆధ్వర్యంలో, కోహెడలో ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో, తొగుటలో సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో, దౌల్తాబాద్‌లో ఎస్ఐ ప్రేమ్ దీప్ ఆధ్వర్యంలో, రాయపోల్ ఏఎస్ఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలి: తపస్

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పెండింగ్ డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి అన్నారు. మంగళవారం తపస్ కొండపాక మండల మండలాధ్యక్షులు బుచ్చిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. కరువు భత్యం చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ నెల 28న తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. తపస్ సంఘం నాయకులు నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హామీ మరచిన సీఎం రేవంత్: వంటేరు


గతంలో రేవంత్‌రెడ్డి దీక్ష చేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్, న్యూస్‌టుడే: మల్లన్నసాగర్ నిర్వాసితులకు గతంలో నిరాహార దీక్ష సందర్భంగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నిర్మించొద్దని తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిర్వాసితులు నిర్వహించిన దీక్షలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి ఎకరాకు రూ.12 లక్షలు ఇవ్వాలని అప్పటి భారాస ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారన్నారు. ఇప్పుడు ఆయన సీఎం అయినప్పటికీ నిర్వాసితులను పట్టించుకోవడం లేదన్నారు. అనాటి సీఎం కేసీఆర్ నిర్వాసితులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారన్నారు. నిర్వాసిత కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి సీఎం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. భారాస మండల, పట్టణాధ్యక్షులు పెండే మధు, నవాజ్ మీరా, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

సిద్దిపేట: క్యాన్సర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేటలోని ప్రతిభా డిగ్రీ కళాశాలలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లోహిత్‌సాయి ఆసుపత్రి ఛైర్మన్ డా.భాస్కర్ హాజరై అవగాహన కల్పించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

హుస్నాబాద్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని ఏసీపీ సతీశ్ అన్నారు. హుస్నాబాద్‌లోని బుడిగజంగాల కాలనీలో ఏసీపీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం వల్ల ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. సీఐ కొంద్రు శ్రీను, హుస్నాబాద్, కోహెడ ఎస్ఐలు తోట మహేశ్, అభిలాష్ పాల్గొన్నారు.

బల్దియాలో సీసీ రోడ్లు నిర్మించండి: సీపీఐ

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సీసీ రోడ్లు నిర్మించి బురద కష్టాలు తీర్చాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం గజ్వేల్‌లో మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో చాలా వార్డుల్లో మట్టి రోడ్లు ఉండడంతో వర్షాల వేళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిధులిచ్చి అన్ని వార్డుల్లో సీసీలు నిర్మించాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక

గజ్వేల్ గ్రామీణ: మండలం ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు గంప శ్రీనివాస్ గుప్తా తెలిపారు. గజ్వేల్ మండలాధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన శేఖర్ గుప్తా, పట్టణాధ్యక్షుడిగా శ్రీనివాసు గుప్తా, ఉపాధ్యక్షులుగా వెంకటేశం తదితరులను ఎన్నుకున్నామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్సీ రాజమౌళి తదితరులు ఉన్నారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

నంగునూరు: నేను చనిపోతున్నానంటూ పురుగుల మందు తాగిన వీడియోను స్నేహితులకు వాట్సాప్‌లో పంపిన యువకుడు అడవిలో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న అతని మిత్రులు రాజగోపాలపేట ఎస్ఐ ఎండీ ఆసిఫ్‌కు తెలిపారు. స్పందించిన ఎస్ఐ హుటాహుటిన 108కి సమాచారం అందించి అతని ఫోన్ ట్రేస్ చేసి బద్దిపడగ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన నంగునూరు మండలం బద్దిపడగలో మంగళవారం జరిగింది. సిద్దన్నపేట గ్రామానికి చెందిన ఖానాపురం సాయి కుటుంబ కలహాలతో మనస్తాపంతో పురుగుమందు తాగినట్లు సమాచారం.

బాధిత కుటుంబానికి చేయూత

మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లికి చెందిన పర్స నారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట భారాస మండలాధ్యక్షుడు రవి, నాయకులు ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నేతలు

బోధనా రుసుములు విడుదల చేయండి

సిద్దిపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ వివేక్ ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బోధన రుసుములు, ఉపకార వేతనాలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలకులు మారినా విద్యారంగం నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. నాయకులు ఒక్కసారిగా కార్యాలయం లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని, అరెస్టు చేసి పట్టణ మూడో ఠాణాకు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై పోలీసులు వదిలిపెట్టారు.

గజ్వేల్: ఉపకార వేతనాలు విడుదల చేయాలంటూ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

చెరువులు, కుంటలను ఆక్రమిస్తే సహించం

చేర్యాల, న్యూస్‌టుడే: చెరువులు, కుంటల శిఖం భూములు ఆక్రమణకు గురైతే సహించేది లేదని, ఎప్పటికైనా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం తప్పదని చేర్యాల సబ్ డివిజన్ నీటిపారుదలశాఖ డీఈఈ శ్యాం తెలిపారు. దీనిలో భాగంగానే మంగళవారం మద్దూరు మండలం మర్మాముల శివారులోని సాయివెల్లికుంట శిఖంలో గతంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు నిర్మించిన మట్టి రోడ్డును మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించినట్లు చెప్పారు. గత రెండేళ్లుగా మర్మాములకు చెందిన కొందరు ఈ కుంటను పరిరక్షించేదుకు అనేక విధాలుగా కృషిచేశారు. ఈ సందర్భంగా ఐబీ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

‘ఎస్ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయం’

బెజ్జంకి, న్యూస్‌టుడే: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి గురుకులాల వ్యవస్థాపకుడు, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ ఎనలేని కృషి చేశారని స్వేరోస్ నెట్‌వర్క్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఉప్పులేటి బాబు అన్నారు. మంగళవారం బెజ్జంకిలో శంకరన్ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుకులాల ఏర్పాటుతో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. కార్యక్రమంలో శంకర్, మోహన్, నరేష్, శ్రీనివాస్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


చేర్యాలలో కొనుగోళ్లు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణ, విపణి ఛైర్‌పర్సన్ శ్వేత, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తదితరులు

చేర్యాల, న్యూస్‌టుడే: అన్నదాతల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ విపణిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ మేరుగు కృష్ణ, పురాధ్యక్షురాలు స్వరూపారాణి, విపణి ఛైర్‌పర్సన్ శ్వేతలతో కలిసి మంగళవారం ప్రారంభించారు. పీఏసీఎస్ డైరెక్టర్లు కొమ్ము రవి, బాల్‌రెడ్డి, శంకరాచారి పాల్గొన్నారు.


సిద్దిపేట అర్బన్: సిద్దిపేట గ్రామీణ మండలం చిన్నగుండవెల్లి, ఇర్కోడు, తోర్నాల, బుస్సాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూజల హరికృష్ణ అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధరశర్మ, ఏపీఎం విజయనిర్మల, లక్ష్మీ, రాములు, గోపీకృష్ణ, సదాశివరెడ్డి, కనకయ్య ఉన్నారు.

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండలం వంగరామయ్యపల్లి, మీర్జాపూర్, అక్కన్నపేట మండలం రేగొండలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, తదితరులు ప్రారంభించారు.

యువతా.. ధూమపానం దరిచేరొద్దు


అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం పంతులుతండా, గౌరవెల్లి గ్రామాల్లో ధూమపానంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పొగ తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి వైద్యసిబ్బంది వివరించారు. ధూమపానం ఒకసారి అలవాటైతే మానడం చాలా కష్టమన్నారు. విద్యార్థులు, యువత వాటికి దూరంగా ఉండాలన్నారు. ధూమపానంపై యువతకు అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది బాబూరావు, అనిల్, ఏఎన్ఎంలు షరీనా, సారమ్మ, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, పీడీ జంగపల్లి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నాయకులు

నంగునూరు, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లో ఆలయంలో విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రం నంగునూరులో భాజపా, హిందూ సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు వర్తక సంఘాల యజమానులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. హైందవ సోదరులు శాంతియుతంగా ర్యాలీ తీశారు. బంద్ విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో రాజగోపాలపేట, చిన్నకోడూరు ఎస్సైలు ఎండీ ఆసీఫ్, బాలకిషన్ తన సిబ్బందితో కలిసి బంద్ కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి: భారాస


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పురాధ్యక్షురాలు రజిత, తదితరులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పది రోజులు కావొస్తున్నా ఇంకా తూకాలు ప్రారంభించలేదని హుస్నాబాద్ భారాస నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం హుస్నాబాద్ విపణిలోని కేంద్రాన్ని పురాధ్యక్షురాలు ఆకుల రజిత, ఉపాధ్యక్షురాలు అనిత, పట్టణ భారాస అధ్యక్షుడు అన్వర్‌పాషా, నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జునరెడ్డి తదితరులు సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. భారాసవి రాష్ట్ర కార్యదర్శి పరుశురాం, పుర కోఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సిద్దిపేట టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాల సాయిరాం, భారాస నాయకులు సారయ్య, సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 417 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా, కేవలం 80 మాత్రమే ప్రారంభించారన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు.

చిన్నకోడూరు: ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని గంగాపూర్ సొసైటీ ఛైర్మన్ కనకరాజు కోరారు. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఏవో జయంత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం గొల్లపల్లికి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. ఈ నెల 21న తల్లిదండ్రులు వ్యవసాయ బావివద్దకు వెళ్లగా ఎవరూ లేని సమయంలో ఇంట్లోంచి వెళ్లిపోయింది. గ్రామంలో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు కన్పించడం లేదని పేర్కొంటూ యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా డిగ్రీ చదువుతున్న ఆ యువతికి ఇటీవల వివాహం నిశ్చయమైంది. పక్క గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు మంగళవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా తొమ్మిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రూ.14,000 జరిమానా విధించారు.

పోగొట్టుకున్న చరవాణి అప్పగింత

కొండపాక గ్రామీణం: తిమ్మారెడ్డిపల్లికి చెందిన కోల రాజు పోగొట్టుకున్న చరవాణిని కుకునూరుపల్లి ఎస్సై పి.శ్రీనివాస్ మంగళవారం బాధితునికి అప్పగించి మాట్లాడారు. గత నెల 21న రాజు తన చరవాణి పోగొట్టుకోగా కుకునూరుపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ సాంకేతికతతో చరవాణిని గుర్తించి బాధితుడికి అప్పగించామని తెలిపారు.

‘భూ నిర్వాసితులకు కేసీఆర్ హయాంలో అన్యాయం’

ములుగు: భారాస ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు మాకు అన్యాయం చేశారని కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితులు ఆరోపించారు. మంగళవారం ములుగు మండలం మామిడ్యాల ఆర్ అండ్ ఆర్ కాలనీలో మామిడ్యాల, బైలంపూర్, తానేదార్‌పల్లి, తాండ గ్రామాలకు చెందిన కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితులు హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. నిర్వాసితులు ఇళ్లను ఖాళీ చేసేటప్పుడు రవాణా ఖర్చుల కింద ఒక్కో కుటుంబానికి కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. మాజీ సర్పంచులు నాగరాణి, శ్రీనివాస్ గౌడ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు: తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించాలని చిన్నకోడూరు మండలంలోని చెల్కలపల్లి గ్రామస్థులు అన్నారు. ఎల్లాయిపల్లి శివారులోని పంపుహౌజ్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల సరిహద్దుల్లో అనంతగిరి జలాశయం నిర్మించారు. ఇక్కడి నుంచి అదనంగా ఒక టీఎంసీ నీటిని తరలించేందుకు గతంలోనే పైపులైన్ కాలువ పనులు చేపట్టారు. తమ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సిద్దిపేట గ్రామీణ సీఐ శ్రీను, స్థానిక ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది, నీటిపారుదలశాఖ డీఈ రవీందర్ అక్కడి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి సరైన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

రోడ్డుపై గుంత.. ఆదమరిస్తే చింత


బతుకమ్మ చెరువు కూడలిలో ఆంజనేయస్వామి ఆలయం ఎదుట

నిత్యం ప్రజలు సంచరించే రహదారులు బాగుంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. అలా లేనట్లయితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముంటుంది. చేర్యాల పట్టణం బతుకమ్మ చెరువు కూడలిలో ఆంజనేయస్వామి ఆలయం ఎదుట నడిరోడ్డుపై గుంత పడి ఇబ్బందికరంగా మారింది. మురుగుకాలువపై నిర్మించిన పైకప్పు కూలిపోయి గుంత ఏర్పడింది. రోడ్డు మధ్యలో ఉండటం పలువురు అందులో పడి గాయాల పాలయ్యారు. ఇంత జరుగుతున్నా ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పుర కమిషనర్ నాగేందర్ దృష్టికి తీసుకెళ్లగా.. నాలుగైదు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, చేర్యాల